భూమికి భరోసా దక్కేనా?

రైతు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చింది. పైలెట్ గ్రామాలను ఎంచుకుని సాధ్యసాధ్యాలపై నిశితంగా పరిశీలించింది. అనంతరం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 'రైతు సదస్సు'కు శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. కొత్త చట్టంతోనైనా తమ సమస్యలకు పరిష్కారం దొరకాలని రైతులు, భూ బాధితులు కోరుకుంటున్నారు.


నల్లవెల్లి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

భూ భారతిపైనే రైతుల ఆశలు
- రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన
- 12 గ్రామాల్లో పూర్తయిన రెవెన్యూ సదస్సులు
- వెయ్యికి పైగా అందిన దరఖాస్తులు
- సమస్యలు త్వరగా పరిష్కరించాలంటున్న భూ బాధితులు

యాచారం: భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఊరట కలిగించేందుకు ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం తెచ్చింది. చట్టంపై అవగాహన కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అర్జీలు స్వీకరిస్తోంది. కానీ కొత్త చట్టంపై రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. గతంలో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. 'భూ సమస్యలు ఇప్పుడే పరిష్కారం కావు. తరువాత కలవండి. చూద్దాం' అని చెప్పినట్లు రైతులు పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పేరు నమోదుకు తంటా

ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుతో యాచారం మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గుంట భూమినైనా తమ పేరిట రికార్డుల్లో నమోదు చేయంచుకోవడం కోసం కర్షకులు కనాకష్టాలు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో తెచ్చిన ధరణి పోర్టల్‌తో రూ.వేలు ఖర్చు చేసి, మీ సేవల్లో అర్జీలు పెట్టుకున్నా.. రెవెన్యూ అధికారులు కనీసం వాటిని పరిశీలించకుండా రిజెక్ట్ చేశారని, ఈ విషయం తెలియక తహసీల్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాలికి బలపం కట్టుకొని తిరిగి అసలసిపోయామని పలువురు అన్నదాతలు పేర్కొంటున్నారు. తీరా అవే భూ సమస్యలపై.. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తుందని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి.. తరువాత చూద్దాం!

మండల పరిధి 23 గ్రామాల్లో మంగళవారం వరకు 12 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి. ప్రతి గ్రామం నుంచి 50 నుంచి 200 వరకు వివిధ రకాల భూ సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసుకున్నారు. కానీ ఆ ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు భరోసా కల్పించలేక పోయారని ప్రాంత రైతులు పలువురు చెప్పడం గమనార్హం. ఏమైనా వివరాలు కోరితే.. 'మీరైతే ముందు దరఖాస్తు ఇవ్వండి. తర్వాత సమాచారం ఇస్తాం. వచ్చి కలవండి' అని చెబుతున్నారని వివరించారు. మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, మొండిగౌరెల్లి, చింతపట్ల, నస్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, చింతుల్ల గ్రామాల సదస్సుల్లో రైతులు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. రైతుల అనుమానాలు తీర్చేందుకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి సోమవారం నల్లవెల్లి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో చర్చించి, న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.


నస్దిక్‌సింగారం రెవెన్యూ సదస్సులో డీటీ కీర్తి సాగర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఇప్పటికైనా..



గ్రామంలోని సర్వే నంబరు 179,180,181లలో 7 ఎకరాలకు పైగా ఉన్న పట్టా భూమి ఉంది. అందులో ఇంకా 16 గుంటలు తన పేరిట నమోదు కావాల్సి ఉంది. పరిష్కరించాలని ఏళ్లుగా వేడుకుంటున్నాను. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కోదండరెడ్డికి ఫిర్యాదు చేశాను. ఇప్పటికైనా న్యాయం చేయండి.

– బి.యాదమ్మ, రైతు, నల్లవెల్లి

వెంటనే పరిష్కరించాలి



భూ సమస్యలపై రైతులు అనేక సార్లు దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ ఏ ఒక్కరికీ న్యాయం జరగడం లేదు. మండలంలో 2,500లకు పైగా వివిధ రకాల భూ సమస్యలు ఉన్నాయి. మళ్లీ అవే సమస్యలపై ప్రస్తుత రైతు సదస్సుల్లో అర్జీ పెట్టుకుంటున్నారు. సమస్యను అక్కడికక్కడే పరిష్కరిస్తే బాగుంటుంది. లేకపోతే కథ మొదటికి వస్తుంది.

– అంజయ్య యాదవ్, కిసాన్‌మోర్చా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మొండిగౌరెల్లి

ఆందోళన వద్దు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రతి ఫిర్యాదుపై సమస్యను రైతులకు తెలియజేస్తున్నాం. ఇప్పటి వరకు వెయ్యికి పైగా దరఖాస్తులు అందాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తాం.

–అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి నాదర్‌గుల్ ఫీడర్, బోటిక్ ఫీడర్ కింద చెట్ల నరికివేత కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రవీందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్స్, వైష్ణవి ఎన్‌క్లేవ్, పీఎంఆర్, కేఎంఆర్‌సీ అండ్ అగ్రికల్చర్ లైన్ నిలిపివేయనున్నారు. బోటిక్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైకేఆర్, జయసూర్య పట్నం, సీబీ ఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేడ్కర్ నగర్, మారుతీనగర్, టెంపుల్ టౌన్, చిలుకూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్, నాదర్‌గుల్, అయోధ్యనగర్, శాంతినగర్, ధరణి ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్ కాలనీ, బాలాజీ హోమ్స్, మారుతి ఎన్‌క్లేవ్‌కు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జీపీ భవనానికి రూ.20 లక్షలు మంజూరు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఈజీఎస్ కింద ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని పడకల్ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం తెలిపారు. పంచాయతీగా ఏర్పడిన ఏడేళ్ల తరువాత భవనం మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. భవనం లేక ప్రజలు, అధికారులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పార్క్ స్థలం కబ్జాపై ఫిర్యాదు


పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీలత

యాచారం: మండల పరిధి గునుగల్ గ్రామంలో సుమారు రూ.కోటి విలువ చేసే పార్క్ స్థలం కబ్జాపై గ్రామస్తులు మంగళవారం మండల పంచాయతీ అధికారి శ్రీలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2013లో గ్రామంలోని సర్వే నంబరు 602లో 9 ఎకరాల 28 గుంటల భూమిలో లేఅవుట్ చేశారని పేర్కొన్నారు. పార్క్ స్థలం కింద 500 గజాలకు పైగా స్థలం వదిలారని తెలిపారు. ఆ జాగను తాజాగా కొందరు అక్రమార్కులు ఆక్రమించేందుకు యత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి స్పందించిన అధికారి.. ఆ స్థలానికి కంచె ఏర్పాటు చేయించి, అక్రమార్కులకు నోటీసులు ఇస్తామని తెలిపారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయండి


మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు

యాచారం: మండల పరిధి నక్కర్తమేడిపల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన లిక్కి వెంకటరెడ్డి మంగళవారం గ్రంథాలయ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది ఉన్నతంగా చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారని, పోటీ పరీక్షల నిమిత్తం కావాల్సిన పుస్తక సామగ్రిని నిల్వ ఉంచేలా చూడాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆమనగల్లు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. తలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. వారికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. నాలుగు నెలల పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ శ్రీకాంత్‌కు అందించారు. కార్యక్రమంలో కార్మికులు జంగయ్య, రాములు, పాండు, రామచంద్రయ్య, ఆగయ్య, రాములు, యాదమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


కడ్తాల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్ పర్సన్ గీత


ఆమనగల్లు: తలకొండపల్లిలో..

కడ్తాల్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించడం హర్షించదగిన విషయమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి ఆమె సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటిస్తూ, ముదిరాజ్ వర్గానికి చెందిన శ్రీహరికి కేబినెట్‌లో స్థానం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, సంఘం నాయకులు యాదయ్య, చెన్నయ్య, రాఘవేందర్, నర్సింహ, జంగయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, అంజయ్య, కృష్ణ, నర్సింహ, బుచ్చయ్య, యాదగిరి, సాయి, రాములు ఉన్నారు.

ఆమనగల్లులో..

మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించిన సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య, నాయకులు సురేశ్, మల్లేశ్ ఉన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీ భవానీ నాగలింగేశ్వస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. జంగమ మహేశ్వర అర్చకులు మహంతయ్యస్వామి, పవన్‌స్వాముల నేతృత్వంలో ఉదయం నుంచి మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచాచార్య కలశ స్థాపన, నవగ్రహారాధన, మంటప దేవతా ప్రతిష్ఠ, రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం భవాని నాగలింగేశ్వర స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో భక్తులు మల్లప్ప, కిరణప్ప, విజయప్ప, ధీరేశ్వరప్ప, నెల్లికుమార్, సేనప్ప, మధు, పొగాకు వినోద్, సురేష్, కడియాల నాగేశ్, సుకన్య, మమత, సునీత, నెల్లి స్వరూప, కడియాల అనిత, దేవి, వేణి, రేణుక, సువర్ణలు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణ క్రతువులో భక్తజనం

పీసీసీ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ పవార్



యాచారం: పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల పరిధి తక్కళ్లపల్లితండా వాసి అంగోత్ వెంకటేశ్ పవార్‌ను నియమిస్తూ సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. వెంకటేశ్.. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిష్యుడు. నాడు వైఎస్ఆర్ పాదయాత్రలో ఆయన వెంట నడిచాడు. కాంగ్రెస్ రెండో దఫా అధికారంలోకి వచ్చినప్పుడు వెంకటేశ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. కానీ మహానేత మృతితో పవార్‌కు న్యాయం జరగలేదు. తాజాగా పీసీసీ జంబో కార్యవర్గంలో చోటు దక్కింది.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడ ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల మధ్య బీటీరోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. అధ్వాన రోడ్డుకు మోక్షం కలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.65 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టామని మాజీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు బిలయ్య, రమావత్ కల్యాణ్ నాయక్‌లు తెలిపారు. మోహన్ నాయక్, రాజు నాయక్ ఉన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నకుమార్


మహేశ్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శర్మ

మంచాల: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పేరూరి ప్రసన్నకుమార్ శర్మను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిందని సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్య అందిస్తాం

మంచాల: ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడంలో పూర్వ విద్యార్థుల కృషి మరువలేనిదని ఎంఈఓ రాందాస్ అన్నారు. మంగళవారం ఎల్లమ్మతండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన పాఠశాల ప్రారంభోత్సవ సదస్సులో ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మాజీ ఎంపీపీ గుండమోని జయమ్మ ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఆమనగల్లు: తలకొండపల్లిలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి రేణుక

- రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి
- హెచ్‌టీ పత్తి విత్తనాల అమ్మకం నిషేధం
- వ్యవసాయ అధికారులు

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తలకొండపల్లి మండల వ్యవసాయ అధికారి రేణుక హెచ్చరించారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ.. డీలర్లు విత్తన చట్టం 1996 నిబంధనల ప్రకారం రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, దుకాణం ఎదుట ధరల పట్టికతో పాటు స్టాకు వివరాలను ఉంచాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. హెచ్‌టీ కాటన్ విత్తనాలు అమ్మకంపై నిషేధం ఉన్నందున, అలాంటివి విక్రయించరాదని హెచ్చరించారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనంతరం విత్తనాల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం పంపారు.

మోసాలకు పాల్పడితే..

కడ్తాల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, కల్తీ, మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాలు ఉత్పత్తి చేసిన సంస్థల వివరాలు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. విత్తన నమూనాలు సేకరించి, పరిశీలనకు పంపారు. కార్యక్రమంలో దుకాణాల డీలర్లు శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, చరణ్‌తేజ్ ఉన్నారు.


కడ్తాల్: విత్తనాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీలత

నిధులు అందక.. నిలిచిన పనులు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గత ప్రభుత్వం 2022లో శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మనఊరు- మనబడి పథకం పేరిట బడి భవనాలను తీర్చేదిద్దేందుకు సంకల్పించింది. కానీ నిధులు అందక పనులు సాగక.. పథకం అభాసుపాలైంది. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం పలు పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేయగా.. అసంపూర్తి నిర్మాణాలు, వసతుల లేమితో దర్శనమిచ్చాయి.

అటకెక్కిన మనఊరు- మనబడి
- సమస్యల్లో సర్కారు బడులు
- అసంపూర్తి నిర్మాణాలతోనే పాఠశాలలు సిద్ధం

ఇబ్రహీంపట్నం: పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మోడ్రన్ కిచెన్లు, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణాలు, లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూమ్, ఫర్నిచర్ ఏర్పాటు చేయడం మనఊరు- మనబడి పథకం ముఖ్యలక్ష్యం. ఇబ్రహీంపట్నం మండలంలో 48 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పథకం కింద 15 బడులు ఎంపికయ్యాయి. శేరిగూడ ప్రాథమిక, దండుమైలారం ఉన్నత పాఠశాలలో మినహా ఎక్కడా పనులు పూర్తికాలేదు. నిధులు అందక అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. కొంగరకలాన్, ఆదిబట్ల ప్రాథమిక పాఠశాల్లో పనులు ప్రారంభానికి నోచుకోలేదు.


ఇబ్రహీంపట్నం: ఉన్నత పాఠశాలలో స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయిన బాలికల టాయిలెట్స్

ఉన్నది కూల్చి.. ఉన్నత పాఠశాలకు మార్చి

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయ్‌లెట్స్ నిర్మాణాన్ని స్లాబ్ వరకు చేపట్టి వదిలేయగా, డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తయినా పెయింటింగ్, ఫర్నీచర్ పనులు నిలిచిపోయాయి. బాలికల పాఠశాలలో మోడ్రన్ కిచెన్ షెడ్ గోడలకే పరిమితం కాగా, డైనింగ్ హాల్ పూర్తిస్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు. శిథిలావస్థ చర్లపటేల్‌గూడ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించి, అదేస్థానంలో స్లాబ్ వరకు నిర్మాణం చేపట్టి వదిలేశారు. దీంతో ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మిగతా పాఠశాలల్లో ఇదే దుస్థితి. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనైనా సమస్యలు తీరుతాయని భావించిన విద్యార్థులకు.. నిరాశే మిగిలింది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పథకం నిర్లక్ష్యానికి గురయిందన్న ఆరోపణలు వస్తున్నాయి. పథకం కింద చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారని పలువురు పేర్కొంటున్నారు.

నీరుగారిన లక్ష్యం

కడ్తాల్: సర్కారు బడుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించిన మనఊరు- మనబడి పథకం అటకెక్కింది. నిధుల లేమితో లక్ష్యం నీరుగారిపోయింది. మండలంలోని 16 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. వాటిల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, కిచెన్‌షెడ్లు, డైనింగ్ హాల్స్, గ్రీన్ బోర్డులు, పెయింటింగ్, విద్యుత్, ఫర్నీచర్, తాగునీటి వసతి, ల్యాబ్ వంటివి నిర్మించాలని సంకల్పించారు. కానీ.. ఎంపీపీఎస్ బాలికల పాఠశాలతో పాటు, బాలుర, ముద్విన్ ఎంపీపీఎస్, న్యామతాపూర్, సాలార్‌పూర్ పాఠశాలలో మాత్రమే పూర్తి స్థాయిలో పనులు చేశారు. మిగతా 11 బడుల్లో పనులు ప్రారంభించారు. నిధులు అందకపోవడంతో ఆపేశారు. రావిచేడ్ ఉన్నత పాఠశాలకు ఇదే దుస్థితి. చేసిన వాటికి నిధులు రాలేదు. చేయాల్సిన మొదలు పెట్టలేదు.


పెయింటింగ్‌కు నోచుకోని మక్తమాధారం ప్రాథమికోన్నత పాఠశాల

భూ భారతితో సమస్యలకు చెక్


ఆమనగల్లు: తహసీల్దార్ లలితకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

- రైతు సదస్సులను వినియోగించుకోండి
- తహసీల్దార్లు లలిత, షేక్ ముంతాజ్

ఆమనగల్లు: రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం తెచ్చిందని ఆమనగల్లు తహసీల్దార్ లలిత అన్నారు. ఈ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండోరోజు 155 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కొత్త చట్టంతో భూములకు భద్రత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీ ధనుంజయ, మాజీ కో- ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌ఖాద్రి, మాజీ సర్పంచ్ యాదయ్య, డిప్యూటీ తహసీల్దార్ సంపత్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టం తెచ్చిందని తహసీల్దార్ షేక్ ముంతాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధి సాలార్‌పూర్, ఎక్‌రాజ్‌గూడ రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాలార్‌పూర్‌లో ఆ గ్రామ రైతులు తమ భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.